క్లుప్తంగా

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా రమేష్‌బాబు



గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా గొర్లి రమేష్ బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్ ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వర్తించిన జి.జగదీష్‌కుమార్ ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేశారు. ఆ స్థానంలో కురు పాం ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓపీఆర్డీగా విధులు నిర్వర్తిస్తున్న రమేష్‌బాబుకు ఉన్నతాధికారులు ఎఫ్ఏసీ ఎంపీడీఓగా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మండలాభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

పైనాపిల్ వ్యాన్ బోల్తా

సీతంపేట: రుక్మిణిగూడ ఘాట్ రోడ్‌లో సోమవారం పైనాపిల్ లోడుతో వెళ్తున్న వ్యాన్ బోల్తా పడింది. ఈ ఘటనలో వ్యాన్‌లో ప్రయాణిస్తున్న పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. విశాఖపట్నం మార్కెట్‌కు పైనాపిల్ పంటను తరలిస్తుండగా వ్యాన్ బ్రేకులు ఫెయిల్ అవడంతో అదుపుతప్పి బోల్తాపడినట్లు స్థానికులు తెలిపారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై జగదీష్‌నాయుడు తెలిపారు.

కూలిన పూరిల్లు



కూలిన ఇంటి వద్ద బాధితులు

కొమరాడ: మండలంలోని గుణదతీలేస్ పంచాయతీ కొరిశీల గ్రామంలో బడె ప్రసాద్‌కు చెందిన పూరిల్లు ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయింది. ఉండేందుకు గూడు లేక బాధితులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఎవరూ తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

మినీ ఉద్యోగమేళాలో 47 మంది ఎంపిక



అభ్యర్థులను ఎంపిక చేస్తున్న సిబ్బంది

సీతంపేట: స్థానిక వైటీసీలో సోమవారం మినీ ఉద్యోగ మేళా నిర్వహించారు. జీఎంఆర్ రక్షా సెక్యూరిటీ సంస్థ ఆధ్వర్యంలో సెక్యూరిటీ గార్డు పోస్టులకు ఎంపికలు నిర్వహించారు. మొత్తం 65 మంది అభ్యర్థులు హాజరుకాగా.. వారిలో 47 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు వైటీసీ మేనేజర్ వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో జీఎంఆర్ ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జ్ హనుమంతురావు, ఏపీఓ గణేష్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చేయూత డబ్బులు చెల్లించాలి

సీతానగరం: మండలంలోని మహిళలకు వైఎస్ఆర్ చేయూత ఆర్థిక సహాయాన్ని పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు రెడ్డి లక్ష్ము నాయుడు, సీఐటీయూ నాయకుడు గవర వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేయూత పథకం కింద చెల్లించాల్సిన రూ.18,500 ఆర్థిక సహాయాన్ని చెల్లించాలని కోరుతూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా లక్ష్మునాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన చేయూత పథకం ఆర్థిక సహాయాన్ని కొంతమందికి బ్యాంక్ ఖాతాల్లో జమచేసినప్పటికీ ఎక్కువ మందికి ఆర్థిక సహాయం బ్యాంక్ ఖతాలకు జమ చేయకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నార న్నారు. ఎన్నికల ముందున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం బటన్ నొక్కగానే ఏకకాలంలో అందరికీ ఒకేవ్యాయం బ్యాంక్ ఖాతాలకు జమ అయ్యేదన్నారు. 2024లో చివరి విడతగా జగనన్న బటన్ నొక్కే సమయానికి ఎన్నికల కోడ్ నిబంధనలు రావడంతో ఇబ్బందులు వచ్చాయని, ప్రభుత్వం స్పందించి చేయూత పథకం నిధులు మంజూరు చేయాలని లేనిపక్షంలో దశల వారీగా ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస రావుకు వినతిపత్రం అందజేశారు.

గర్భిణుల హాస్టల్ సిబ్బందికి బకాయి వేతనాలివ్వాలి

పార్వతీపురం టౌన్: గుమ్మలక్ష్మీపురం, సాలూరు వైటీసీల్లో పార్వతీపురం ఐటీడీఏ ఏర్పాటు చేసిన గిరిజన గర్భిణుల వసతి గృహాల్లో సేవలు అందిస్తున్న సిబ్బందికి గడిచిన పద్దెనిమిది నెలలుగా ఇవ్వాల్సిన బకాయి వేతనాలు తక్షణమే ఇవ్వాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ కోరారు. ఈమేరకు సోమవారం ఆయన గర్భిణుల వసతి గృహం సిబ్బందితో కలిసి కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పద్దెనిమిది నెలలుగా వేతనాలు రాకపోతే కుటుంబాలతో ఎలా బతకాలని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సిబ్బంది కె.శాంతి సుధ, ఎం.వజ్రం, యు.మహాలక్ష్మి, ఎ.కళావతి, పి.రమాదేవి, యు.ప్రభావతి, పి.పద్మావతి, బి.శకుంతల, టి.సోమినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పర్యవేక్షణలో
పింఛన్ల పంపిణీ



గుమ్మలక్ష్మీపురం: గడ్డికాలనీలో లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి



గరుగుబిల్లి: సంతోషపురంలో పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్



సీతంపేట: వలగెడ్డలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ, తదితరులు



పాలకొండ రూరల్: మండలంలో పింఛన్ల పంపిణీని పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

సీతంపేట/పాలకొండ: సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం సజావుగా సాగింది. సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి బయోమెట్రిక్ నమోదు చేసి పింఛన్ డబ్బులు అందజేశారు. ఉదయం కాసేపు సర్వర్ మొరాయించడంతో పింఛన్ల పంపిణీ నిలిచిపోయింది. దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. గతంలో ఎన్నడూ లబ్ధిదారుల ఇంటి వద్దకు పింఛన్లు పంపిణీ చేయనట్టు, ఇప్పుడే కొత్తగా చేస్తున్నట్టు కూటమి పార్టీ నాయకులు గ్రామాల్లో హడావుడి చేశారు. చాలా గ్రామాల్లో పింఛన్‌దారులను సచివాలయానికి పిలిపించుకుని, లేదంటే గ్రామంలో ఒకచోట నిలుచోపెట్టి పింఛన్లు పంపిణీ చేశారనే ఆరోపణలు వినిపించాయి. సీతంపేట మండలం వలగెడ్డ గ్రామంలో, పాలకొండ నగర పంచాయతీ పరిధి గారమ్మకాలనీలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. సీతంపేట మండలంలో మొత్తం 8,135 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా మొదటి రోజు 98 శాతం పూర్తి చేశామని ఎంపీడీఓ కె.గీతాంజలి తెలిపారు.

- పాలకొండ రూరల్: మండలంలోని 32 పంచాయతీ పరిధిలో 7,392 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా.. సోమవారం సాయంత్రానికి 6,702 మందికి పింఛన్లు అందజేసినట్లు ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ తెలిపారు.
- వీరఘట్టం: వీరఘట్టం పంచాయతీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పలువురు వృద్ధులకు పింఛన్లు అందజేశారు. మండలంలో తొలిరోజు 90 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్టు ఎంపీడీఓ ఎంవీవీ సుబ్రహ్మణ్యం తెలిపారు.
- భామిని: మండలంలో 7,057 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా.. సోమవారం సాయంత్రానికి 5,736 మందికి పింఛన్లు అందజేసినట్లు ఎంపీడీఓ కె.కిశోర్‌కుమార్ తెలిపారు.
- గరుగుబిల్లి: మండలంలోని సంతోషపురం గ్రామంలో చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ పర్యవేక్షించారు. పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ డబ్బులతో పాటు ముఖ్యమంత్రి సందేశ పత్రాన్ని అందజేశారు. గ్రామంలోని వృద్ధులతో మాట్లాడి పింఛన్ స్లిప్పులు అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. శత శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు.
- గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం గ్రామంలో సోమవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. మెయిన్ రోడ్డు, గడ్డికాలనీలో పలువురు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.
- కొమరాడ: మండలంలోని పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో లబ్ధిదారులు ఇబ్బందులకు గురయ్యారు. సర్వర్లు మొరాయించడంతో పింఛన్ల పంపిణీ ఆలస్యంగా ప్రారంభమైంది. లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లకుండా వృద్ధులను ఒక చోట నిల్చోపెట్టి పింఛన్లు అందజేశారు. మిగిలిన వారికి సచివాలయానికి వచ్చి తీసుకోవాలని చెప్పి వెళ్లిపోయినట్లు పలువురు లబ్ధిదారులు వాపోయారు.
- జియ్యమ్మవలస: మండలంలోని 31 పంచాయతీల పరిధిలో పింఛన్ల పంపిణీ సోమవారం సజావుగా సాగింది. సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు అందజేశారు. వెంకటరాజపురంలో టీడీపీ సీనియర్ నాయకుడు, గ్రంథాలయ మాజీ చైర్మన్ దత్తి లక్ష్మణరావు, కుదమలో డొంకాడ రామకృష్ణ, అల్లువాడలో ఎంపీపీ బొంగు సురేష్ చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ చేశారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



వాహన తనిఖీలు చేస్తున్న ఏఎంవీఐ, ఆర్టీసీ డిపో మేనేజర్

పాలకొండ రూరల్: వాహన చోదకులు నిబంధనలు అతిక్రమిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జీఎన్ఎస్ఆర్‌కే కుమార్ అన్నారు. పాలకొండ–సీతంపేట ప్రధాన రహదారిలో స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావుతో కలిసి సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశాలతో తనిఖీలు చేపడుతున్నట్లు చెప్పారు. ముఖ్యంగా ఫిట్‌నెస్ లేని వాహనాలు నడపటం, పరిమితికి మించి లోడు, ప్రయాణికులను ఎక్కించటం నేరమన్నారు. మైనర్లకు వాహనాలు నడిపేందుకు ఇవ్వడం, డ్రైవింగ్ లైసెన్సులు, వాహన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలతో రోడ్లపైకి రావటం వంటి చర్యలకు స్వస్తి పలకాలని స్పష్టం చేశారు. ఈ క్రమంలో నిబంధనలు అతిక్రమించిన వాహన చోదకులపై కేసులు నమోదు చేయడంతో పాటు వాహనాలు సీజ్ చేశారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



సమీక్ష నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ

పాలకొండ రూరల్: సచివాలయ సిబ్బందితో పాటు పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని మండల ప్రత్యేకాధికారి అశోక్ కుమార్ స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎస్.రామకృష్ణతో కలిసి సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. పంచాయతీలు, అనుబంధ గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాలపై సమీక్షించారు. తాగునీటి వనరుల క్లోరినేషన్, సీజనల్ వ్యాధులు ప్రబల కుండా తీసుకుంటున్న ముందస్తు చర్యలపై ఆరా తీశారు. పింఛన్ల పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవళిక, ఈఓపీఆర్డీ కె.సూర్యనారాయణ, ఐసీడీఎస్ అధికారి దశారత్నం తదితరులున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమ వసూళ్లపై ఫిర్యాదు



ఉపాధిహామీ కార్యాలయం సిబ్బందికి ఫిర్యాదు పత్రం అందజేస్తున్న వేతనదారులు

జియ్యమ్మవలస: మండలంలోని జోగులడుమ్మ గ్రామానికి చెందిన ఉపాధిహామీ క్షేత్రసహాయకుడు అవకతవకలకు పాల్పడుతున్నట్లు పలువురు వేతనదారులు ఆరోపించారు. ఈ మేరకు ఉపాధిహామీ పథకం జేఈ తేజ, సీనియర్ అసిస్టెంట్ రామారావుకు సోమవారం ఫిర్యాదు చేశారు. ప్రతీ వారం బిల్లుల చెల్లింపు సమయంలో ఒక్కో వేతనదారు నుంచి రూ.100లు చొప్పున వసూలు చేస్తున్నారని, జాబ్‌కార్డు మంజూరుకు రూ.50లు చొప్పున తీసుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై అధికారులు విచారణ చేపట్టి ఫీల్డ్ అసిస్టెంట్‌పై తగిన చర్యలు తీసుకోవాలని వేతనదారులు ఎలకల రాంబాబు, ఎస్.వెంకటరమణ, వై.శంకరరావు, కె.పారినాయుడు, తదితరులు కోరారు.

వేతన బకాయిలు చెల్లించాలి

ఉపాధి వేతనదారులకు ఇవ్వాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సోమవారం ఎంపీడీఓ శ్రీనివాస రావుకు వినతిపత్రం అందజేశారు. అలాగే వేతనదారులకు సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని, రోజుకు రూ.400లు వేతనం అందజేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు భూతాల మోహనరావు, కోరంగి సీతారాం, రాయల ప్రసాద్, సత్యం ఉన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ



కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పాలకొండ రూరల్: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పడిన పిడుగులతో మండలంలోని భాసూరు గ్రామ సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. ఈ ఘటనతో విద్యుత్ లైన్లు పాడవడంతో పాటు 65 వీధి దీపాలు కాలిపోయాయి. గ్రామంలో చీకట్లు అలముకోవడంతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. సర్పంచ్ ఎస్.గురునాయుడు వెంటనే స్పందించి ట్రాన్స్‌కో అధికారుల సహకారంతో సోమవారం విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేపట్టారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

భామిని: మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డులో మహిళలకు, బాలికలకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు హోలీక్రాస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కరణం ప్రభుదాస్ సోమవారం తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులకు రెండు నెలల పాటు కుట్టు శిక్షణ అందిస్తామన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ధ్రువపత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. శిక్షణలో చేరేందుకు ఆసక్తి ఉన్నవారు ఫోన్ 9441319942కు సంప్రదించాలని కోరారు.

టెన్త్‌పాసైన విద్యార్థులకు ప్రోత్సాహకాలు



ప్రోత్సాహక నగదును అందచేస్తున్న హెచ్‌ఎం ప్రసన్నలక్ష్మి

సీతానగరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యనభ్యసించి సుప్రీం కోర్టు న్యాయవాదిగా పనిచేసిన కీర్తిశేషులు అయ్యగారి నరసింహం (జవహర్)జయంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు ప్రొఫెసర్ ఆనంద్ పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.

ఈ మేరకు 2023–24 విద్యాసంవత్సరంలో ఉన్నత పాఠశాల విద్యార్థులు పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన పదోతరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో ప్రథమ స్థానం సాధించిన మర్రాపు హేంత్(551)కు రూ.2,500, ద్వితీయ స్థానం సాధించిన బంకురు లీలాప్రసన్న(547)కు రూ.1,500లు తృతీయ స్థానం సాధించిన తామరాపు హసిని(547)కి రూ.1000లు నగదు ప్రోత్సాహకాన్ని ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రసన్నలక్ష్మి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'నేను బడికి పోతా'ను విజయవంతం చేయాలి

సీతానగరం: ప్రభుత్వ విద్యాశాఖ నిర్వహించే 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా పిల్లలను బడికి పంపించే విధంగా పేరెంట్స్‌కు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ఎం.ఈశ్వర రావు అన్నారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో నేను బడికి పోతా కార్యక్రమంపై ఎంఈఓలు జి. సూరిదేముడు, ఎం.వెంకటరమణ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీడీఓ ఈశ్వర రావు మాట్లాడుతూ బడిఈడు పిల్లలు బడికి వచ్చే విధంగా పిల్లల పేరెంట్స్‌కు అవగాహన కల్పించి పాఠశాలల్లో చేరేవిధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ఎంఈఓలు జి.సూరిదేముడు, ఎం.వెంకటరమణ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించినట్లు తెలియజేశారు. బడిబయట ఉన్న పిల్లలతల్లిదండ్రులతో స్థానిక ఉపాధ్యాయులు అవగాహన సదస్సులు ఎస్ఎంసీ కమిటీ పర్యవేక్షణలోనిర్వహించి పాఠశాలల్లో హాజరు శాతాన్ని పెంపొందించడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, సహోపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఉద్యమాలే కొరటాలకు ఘనమైన నివాళులు

పార్వతీపురంటౌన్: కార్మిక, కర్షక పోరాట ఉద్యమాల్లో కొరటాల సత్యనారాయణ జీవిత చరిత్ర అమోఘమని, ఉద్యమాలకు ఆయన స్ఫూర్తి అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు కె.సుబ్బారావమ్మ అన్నారు. కొరటాల సత్యనారాయణ 18 వ వర్ధంతి సందర్భంగా సోమవారం పార్వతీపురంలోని సుందరయ్యభవనంలో ఆయన చిత్రపటానికి సుబ్బారావమ్మ, సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుబ్బారావమ్మ మాట్లాడుతూ కొరటాల సత్యనారాయణ ఆంధ్ర కమ్యూనిస్ట్ ఉద్యమ నేతల్లో ప్రముఖుడని, భారత కమ్యూనిస్టు పార్టీ–మార్క్సిస్ట్(సీపీఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడని తన శైలిలో కీలకపాత్ర పోషించారాని కొనియాడారు. నేడు నరేంద్ర మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం 2019లో తెచ్చిన మూడు రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని కోరుతూ కారటాల సత్యనారాయణ స్ఫూర్తితోనే నిర్బంధాలను లెక్క చేయకుండా రైతాంగం పెద్ద ఎత్తున చారిత్రాత్మక ఉద్యమం నిర్వహించిందని దీంతో ప్రభుత్వం దిగిరాక తప్పలేదని తెలిపారు. ఆ సందర్భంగా నరేంద్ర మోడీ స్వయంగా పార్లమెంటులో రైతులకు క్షమాపణలు చెప్పి మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కు తీసుకుంటున్నామని ప్రకటించారన్నారు. రైతుల ప్రతినిధులతో చర్చించి మద్దతు ధరలిచ్చేలా పార్లమెంటులో చట్టం తెస్తామని, విద్యుత్ సవరణ బిల్లు ఉపసంహరించుకుంటామని హామీ ఇచ్చారు. కానీ ఆ చట్టాలను మరో రూపంలో అమలు చేస్తూ రైతు కేంద్రంగా ఉన్న మన వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. కేరళ తరహాలో రాష్ట్రంలో రైతు రుణ విమోచన చట్టం తీసుకురావాలని ఆమె డిమాండ్ చేశారు.

డయేరియా సోకకుండా అప్రమత్తం



చిలకలపల్లిలో ర్యాలీ చేస్తున్న వైద్యశాఖ అధికారులు, సిబ్బంది

బలిజిపేట: డయేరియా వ్యాధి సోకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి సూచించారు. డయేరియా నియంత్రణ కార్యక్రమంలో భాగంగా చిలకలపల్లిలో సోమవారం వైద్యశాఖ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు వైద్యశాఖ సిబ్బంది గ్రామాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు పంపిణీ చేస్తారని తెలిపారు. ప్రతి ఇంట్లో 5సంవత్సరాల లోపు చిన్నారులకు డయేరియా సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఎవరికైనా వాంతులు, విరేచనాలు అయితే వెంటనే వైద్యులను సంప్రదించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందరరావు, ఉప సర్పంచ్ గిరి, వైద్యశాఖ సిబ్బంది, ఏఎన్ఎంలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డయేరియాను నిర్మూలిద్దాం..



బత్తిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

భామిని: డయేరియాపై ప్రజలను చైతన్యం చేసేందుకు జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు 2 నెలలు పాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా సోమవారం బత్తిలి పీహెచ్‌సీ పరిధిలో ఆరోగ్య సిబ్బంది చైతన్య ర్యాలీలు నిర్వహించారు. అతిసార వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ప్రదర్శించారు. ర్యాలీలో స్థానిక మహిళలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనతోనే వ్యాధుల నుంచి రక్షణ

- కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



తాడికొండలో నిర్వహించిన డెంగీ అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: డెంగీ వ్యాధి లక్షణాలు, వ్యాప్తి, నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, వ్యాధి వ్యాప్తికి కారణమయ్యే దోమల నివారణకు ముందుకు రావాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పిలుపునిచ్చారు. మండలంలోని తాడికొండ పీహెచ్‌సీని సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. రోగులకు మెరుగైన సేవలందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో తాడికొండ గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొని డెంగీపై ప్రజలను అప్రమత్తం చేశారు. దోమల వల్ల డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపిస్తాయని, కాబట్టి ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని కోరారు. దోమకాటుకు గురికాకుండా దోమ తెరలు వినియోగించాలని సూచించారు. మురుగునీటి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

అనంతరం గ్రామంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ కన్వీనర్ పాడి సుదర్శనరావు, నాయకులు బిడ్డిక పద్మావతి, పీహెచ్‌సీ వైద్యాధికారికారులు ఎం.బుద్ధేశ్వరరావు, అభిలాష్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కె.నాగేశ్వరరావు తదితరులున్నారు.

కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



పాలకొండ: అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ కృష్ణారావు



కొమరాడ: కొత్త చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై నీలకంఠం

పాలకొండ: కొత్తగా వచ్చిన చట్టాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని డీఎస్పీ కృష్ణారావు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం పలు గ్రామాల పెద్దలు, యువత, విద్యార్థులకు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. బ్రిటీష్ కాలం నాటి చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాలను తీసుకొచ్చిందన్నారు. అవి జూలై 1 అర్ధరాత్రి నుంచి అమలులోకి వచ్చాయని తెలిపారు. ఇకపై కొత్త చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై ప్రశాంత్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

- కొమరాడ: భారత ప్రభుత్వం అమల చేసిన కొత్త చట్టాలు జూలై 1 నుంచి అమలులోకి వచ్చాయని, ఇకపై వాటి ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎస్సై కె.నీలకంఠం అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో స్థానిక నాయకులు, ప్రజలకు కొత్తగా తీసుకొచ్చిన చట్టాలపై సోమవారం అవగాహన కల్పించారు. బ్రిటిష్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఐపీసీ, సీఆర్‌పీసీ, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లను రద్దు చేసి, వాటి స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం పేరుతో కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాలను తీసుకొచ్చిందని తెలిపారు. ప్రజలు వాటిపై అవగాహన పెంచుకోవాలని కోరారు.